క్లుప్తంగా

పల్లెల దాహార్తి తీర్చేందుకు కృషి



చిలకలూరిపేట: పల్లెల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మురికిపూడి గ్రామంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ ద్వారా మంజూరైన రూ. 60 లక్షలతో మంచినీటి కుళాయిల ఏర్పాటు, తాగునీటి సరఫరా ప్లాంట్ల నిర్మాణం, పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో పాటు రూ. 60 లక్షలతో బైపాస్ రోడ్డు నిర్మాణం, రూ.15 లక్షలతో సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేసి శిలాఫలకాలు ఆవిష్కరించారు. పట్టణానికి చెందిన తిరుమలయ్య, రాజేశ్వరి దంపతుల కవల పిల్లలు అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. దీనికి సంబంధించిన రూ.4 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్కును వారికి ఎమ్మెల్యే అందించారు.

డైరెక్టరేట్ ఆర్‌డీసీ సెలక్షన్‌కు ఎన్‌సీసీ క్యాడెట్స్



నరసరావుపేట రూరల్: హైద్రాబాద్‌లో ఈనెల 16 నుంచి 25 వరకు ఏపీ,తెలంగాణ ఎన్‌సీసీ డైరక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహించే రిపబ్లిక్ డే క్యాంప్(ఆర్‌డీసీ) సెలక్షన్స్‌కు నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల క్యాడెట్స్ ముగ్గురు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. డ్రిల్ విభాగంలో పి.నిఖిత, కె.హరీష్, ఫ్లాగ్‌ఏరియా డ్రాయింగ్ విభాగంలో బి.నీలిమాలు ఎంపికైనట్టు వివరించారు. గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ చేపట్టిన సెలక్షన్స్‌లో క్యాడెట్స్ ప్రతిభ కనబర్చి డైరక్టరేట్ సెలక్షన్స్‌కు అర్హత సాధించినట్టు తెలిపారు. ఎంపికైన క్యాడెట్స్‌ను కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.

20 నుంచి ఉచితంగా బీఎండీ పరీక్షలు



వినుకొండ(నూజెండ్ల): వరల్డ్ ఆస్టోపోరోసిస్ డే సందర్భంగా పట్టణంలోని శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన ఉచిత వైద్యసేవలు నిర్వహిస్తున్నట్లు హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్, ఎముకలు, కీళ్ల విభాగం డాక్టర్ కొరివిపాడు అభిషేక్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.2 వేలు విలువ చేసే బీఎండీ (ఎముకల దృఢత్వం తెలిపే పరీక్ష) ను ఉచితంగా చేస్తున్నామని వివరించారు. ఈ అవకాశాన్ని వినుకొండ పరిసర ప్రాంత ప్రజలందరూ సద్వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 31వరకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు 9281107993, 9281107992 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సార్ ... కొండవీటి చరిత్ర ఇదీ



నాదెండ్ల: చారిత్రాత్మక ప్రాముఖ్యత కలిగిన కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి బుధవారం జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా కొండవీడు కోట చరిత్ర, రెడ్డి రాజుల విశేషాలు, రాజ్య పరిపాలనకు సంబంధించిన చరిత్ర పుస్తకాన్ని ఆయనకు అందజేశారు. ప్రస్తుతం కొండవీడులో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, పనులను వేగవంతం చేయించి పర్యాటకులకు మెరుగైన వసతులు కల్పించాలని కోరారు.

రొంపిచర్లలో అత్యధిక వర్షపాతం

రొంపిచర్ల: డివిజన్‌లోని రొంపిచర్ల మండలం లోబుధవారం అత్యధికంగా 17.0 ఎం.ఎం వర్షపాతం నమోదైంది. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఎండ వాతావరణం నెలకొన్నా మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు వచ్చి మబ్బులు కమ్మాయి. మండలం అంతటా వర్షం కురిసింది. బుధవారం సాయంత్రం 4 గంటలకు నమోదైన వర్షపాతపు వివరాలు ఇలా ఉన్నాయి.

పత్తి రైతుల్లో దిగులు

- వర్షాలతో పూత, పిందె రాలే ప్రమాదం
- నాణ్యత తగ్గుతుందని ఆందోళన



గణపవరంలో పూత, పిందె దశలో ఉన్న పత్తి పైరు

నాదెండ్ల: నిన్నా మొన్నటి వరకూ కళకళలాడిన పత్తి పొలాలు .. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా దెబ్బతినే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో పత్తి సాగుదారులు ఆందోళన చెందుతున్నారు. మరికొద్ది రోజుల్లో పత్తితీతలు ప్రారంభం కానున్న తరుణంలో క్రింది కాయలు కుళ్లి ఎకరాకు రెండు క్వింటాళ్ళ మేర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఇదేకాక పూత, పిందె కూడారాలి తెగుళ్లు సోకే అవకాశం ఉంది.

జూన్ మొదటి వారంలో నాటిన పత్తి పొలాలు ఆగస్టు చివరి నాటికి వర్షాలు లేక ఎండుముఖం పట్టాయి. ఆగస్టు చివర్లో మంచి వర్షాలు కురవటంతో పత్తి పైర్లు జీవం పోసుకుని పచ్చగా ఎదిగాయి. సెప్టెంబర్ మాసంలో మరోసారి వర్షం కురవటంతో పత్తి పొలాలు కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం సగటున ఎకరాకు 8 క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఈ వర్షం కారణంగా రెండు క్వింటాళ్ళ మేర దిగుబడి తగ్గటంతో పాటూ కాయలు కుళ్లటం, పూత, పిందె రాలి నష్టం చేకూరే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలో 25 వేల ఎకరాలకు పైగా సాగుభూమి ఉండగా, గతేడాది 5900 ఎకరాల్లో పత్తి, 4400 ఎకరాల్లో మిర్చి సాగైంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో స్వల్పంగా పత్తిసాగు తగ్గినా మిర్చి సాగు సాధారణంగానే ఉంది. ఇవికాక పొగాకు, శనగ పంట గతేడాది మంచి ధరలు పలకటంతో రైతులు వాటిపై మొగ్గుచూపారు.

కౌలుతో కలిపి ఎకరాకు రూ.50 వేలుపైగా ఖర్చు

పత్తి సాగు ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ కౌలుతో కలిపి రూ.50 వేలు పైగా ఖర్చుయినట్లు రైతులు చెబుతున్నారు. విత్తనాల కొనుగోలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ కూలీ ఖర్చులు భారీగా పెరిగాయి. ప్రస్తుత మార్కెట్లో పత్తి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. క్వింటా రూ.6 వేలు - రూ.7వేల వరకూ పలుకుతోంది. మిడిల్ పికింగ్‌లో అయితే ఈ ధరలు పెరిగే అవకాశం ఉంది. గతేడాది ఇదే సమయంలో పత్తి క్వింటాకు రూ.8 వేల వరకూ పలికింది.

సీసీఐ మద్దతు ధర పెంపు

గతేడాది సీసీఐ మద్దతు ధర క్వింటా పత్తి రూ.7020లుగా నిర్ణయించి కొనుగోళ్ళు జరిపింది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరను రూ.7521లుగా ప్రకటించింది. ఇప్పటికే ఆర్‌బీకే సిబ్బంది ఈక్రాప్ నమోదు చేయించి రైతులతో ఈకేవైసీ చేయించారు. ఈ నెలాఖరు నాటికి సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

వర్షంతో పత్తి నాణ్యతకు నష్టం



నేను ఈ ఏడాది నా స్వంత పొలం ఐదెకరాల్లో పత్తి సాగు చేశా. ఇప్పటి వరకూ ఎకరాకు 8 క్వింటాళ్లు సరాసరి వస్తుందని భావించా. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా 1–2 క్వింటాళ్ల మేర పత్తి కాయలు కుళ్లి దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ఎకరాకు కౌలు కాకుండా రూ.50 వేలు ఖర్చు పెట్టా. తడిచిన కారణంగా పత్తి నాణ్యత తగ్గే అవకాశం ఉంది.

–అలా శ్రీనివాసరావు, జాష్టివారిపాలెం, నాదెండ్ల మండలం.

సస్యరక్షణతో నష్టనివారణ



ప్రస్తుతం తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలతో పత్తిలో కొంతమేర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. మరికొన్ని రోజుల్లో పత్తితీతలు ప్రారంభం కానున్నందున పగిలిన పత్తి కాయల్లో నీరు చేరి కుళ్ళే అవకాశం ఉంది. పూత, పిందె రాలే అవకాశం ఉంది. ఎకరాకు క్వింటా మేర దిగుబడి తగ్గే అవకాశం ఉంది. రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించి నష్టాన్ని తగ్గించుకోవాలి.

– ఎ. హరిప్రసాద్, మండల వ్యవసాయాధికారి.

రుచి-శుచిలేని మధ్యాహ్న భోజనం



సరికొండపాలెం ప్రాథమిక పాఠశాల (హెచ్‌సీ)లో భోజనం చేస్తున్న విద్యార్థులు

బొల్లాపల్లి: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతాప్రమాణాలు పాటించడం లేదని మండలంలోని సరికొండపాలెం ప్రాథమిక పాఠశాల (హెచ్‌సీ) యాజమాన్య కమిటీ చైర్మన్ ఒంగోలు కోటేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు, 47 మంది విద్యార్థులు ఉన్నారు. పీఎం పోషణ, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత డొల్లతనం కనిపిస్తోంది. అన్నం సరిగ్గా ఉడకకపోవడంతో విద్యార్థులకు ఆరోగ్యపరంగా ఎదురవుతున్నాయి. మధ్యాహ్న భోజనంలో అందించాల్సిన గుడ్డు, రాగి జావ వంటి ఆహార పదార్థాలు సక్రమంగా పంపిణీకి నోచుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. పలుమార్లు ఈ విషయమై పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఉడికీ ఉడకని అన్నంతో మెనూ పాటించని మధ్యాహ్న భోజన పథకంలో లోపాలు ఉన్నాయని, విద్యార్థులకు మధ్యాహ్నం సరైన భోజనం అందించాలని అంటున్నారు. ఈమధ్య కాలంలో మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించకపోవడంతో విద్యార్థులు చాలా మంది ఇళ్ల వద్దే భోజనం చేస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి పాఠశాలను సందర్శించి విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలయ్యేలా నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎస్ఎంసీ చైర్మన్ వాపోతున్నారు.

18 నుంచి రెవెన్యూ సదస్సులు

నాదెండ్ల: ఈ నెల 18 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఏవీ రమణ తెలిపారు. గతంలో భూముల రీసర్వే అయిన గ్రామాల్లో మాత్రమే సదస్సులు జరుగుతాయన్నారు. తొమ్మిది గ్రామాల్లో ఈ నెల 18 నుండి 29 వరకూ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ గ్రామ సచివాలయాల్లో సదస్సులు జరగనున్నందున అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యడ్లపాడులో...

ఈ నెల 18 నుంచి నవంబర్ 2 వరకూ రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ జయశ్రీ చెప్పారు. 18, 19 తేదీల్లో కొండవీడు, 22న మైదవోలు, 23న సొలస, 24న తిమ్మాపురం, 25న ఉన్నవ, 26న మర్రిపాలెం, 28న వంకాయలపాడు, 29న కారుచోల, 30న సందెపూడి, 31న తుర్లపాడు, నవంబర్ 1న జాలాది, 2న యడ్లపాడు గ్రామాల్లో జరుగుతాయన్నారు.

రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న గోపాలరావు

రొంపిచర్ల : రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు అన్నారు. మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన సీపీఎం మండల శాఖ ద్వితీయ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సభకు సీపీఎం మండల సీనియర్ నాయకులు సరికొండ వెంకటేశ్వరరాజు అధ్యక్షత వహించారు. ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక కొరత వలన కొన్ని లక్షల మంది కార్మికులు ఉపాధి కోల్పోయి అవస్థలు పడుతున్నారన్నారు. వరద బాధితులకు ఇప్పటికీ సరైన నష్టపరిహారం అందలేదన్నారు. రాష్ట్రంలో ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటైజేషన్ చేయకుండా ఆపాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. కౌలు రైతు గుర్తింపు కార్డు ఉన్న వారికి రైతు భరోసా కల్పించి, బ్యాంకు రుణాలు ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ముందుగా ఇటీవల మృతి చెందిన సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, ప్రొఫెసర్ సాయిబాబాకు, అదే విధంగా పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య, సీపీఎం మాజీ శాసన సభ్యురాలు మల్లు స్వరాజ్యంలు మృతికి సంతాపం తెలిపారు. అనంతరం రొంపిచర్ల, సంతగుడిపాడు, పరగటిచర్ల గ్రామాల శాఖలకు నూతన కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. సీపీఎం రొంపిచర్ల గ్రామ శాఖ కార్యదర్శిగా అంగులూరి ఫణీంద్ర, సంతగుడిపాడు గ్రామ శాఖ కార్యదర్శిగా బండారుపల్లి నాగేశ్వరరావు, పరగటిచర్ల గ్రామ శాఖ కార్యదర్శిగా పోట్లూరి అంజిరెడ్డి లు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.శివకుమారి, కామినేని రామారావు, బాలకోటయ్య, ఖాశింసైదులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శాఖా సమావేశాలు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న మారుతీ వరప్రసాద్

చిలకలూరిపేట: సీపీఐ శాఖా సమావేశాలను వేగవంతం చేయాలని ఆ పార్టీ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ తెలిపారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నియోజకవర్గ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భవించి డిసెంబర్ 26వ తేదీకి 100వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా నియోజక వర్గాల్లోని అన్ని పట్టణాలు, గ్రామీణ శాఖ సమావేశాలు ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పోరాటాలు చేసిందన్నారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మతోన్మాదాన్ని తీవ్రతరం చేసిందని, మైనార్టీ ప్రజల భద్రతకు హాని తలపెడుతున్నదని ఆరోపించారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో సమస్యలపై పోరాడేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు షేక్ హుస్సేన్, నాగబైరు రామ సుబ్బాయమ్మ, తాళ్లూరి బాబురావు, షేక్ సుబాని, చెరుకుపల్లి నిర్మల పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి

బెల్లంకొండ: గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడమే ధ్యేయంగా గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు పనిచేయాలని ఎంపీపీ చెన్నుపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత వివిధ శాఖల అధికారులు వారి శాఖల పనితీరును వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికీ అందేలా పనిచేయాలని సూచించారు. గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, పనిచేయకుండా ఉన్న బోర్లను గుర్తించి వాటికి మరమ్మతులు చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి కుళాయిలను ఏర్పాటు చేస్తున్న గ్రామాలలో పనులను వేగవంతంగా చేపట్టాలని తెలిపారు. గ్రామాలలో ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ వంద పని దినాలు పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిత్యం సిబ్బందితో చేయించాలని, సీజనల్ వ్యాధులు రాకుండా తాగునీటి ట్యాంక్‌లలో బ్లీచింగ్ వేయించాలని తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి, ఎంపీడీఓ వై.హనుమారెడ్డి, తహసీల్దార్ అప్రువున్నీసా బేగం, వైస్ ఎంపీపీలు బూదాటి మరియమ్మ, షహనాజ్ బేగం, ఎంపీటీసీలు మర్రి శ్రీనివాసరెడ్డి, మాదాసు రాంబాబు, చిట్టెంశెట్టి శివనాగమణి, రేగులగడ్డ తిరుపతమ్మ పాల్గొన్నారు.

పొలంలో సస్యరక్షణ పాఠాలు



గణపవరంలో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి హరిప్రసాద్



కంది పంటను పరిశీలిస్తున్న ఏడీఏ మస్తానమ్మ, ఏవో నరేంద్రబాబు

- వేర్వేరు ప్రాంతాల్లో పొలంబడి
- సూచనలు చేసిన వ్యవసాయ యంత్రాంగం



వినుకొండ ప్రాంతంలో మాట్లాడుతున్న ఏవో సుగుణాబేగం

వినుకొండ(నూజెండ్ల): వర్షాలకు పంటల దెబ్బతినకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుగుణాబేగం సూచించారు. మండలంలోని వి.అప్పాపురం, మార్లెళ్లవారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కంది, వరి, మిరప పంటలను క్షేత్ర సందర్శన చేసి రైతులతో రైతు సేవా కేంద్రాల వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కంది పంటలో వెర్రి తెగులు ఆశించి దిగుబడులు ఆశాజనకంగా ఉండవని తెలిపారు. తెగులు నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో ఎలీషా, మాజీ సర్పంచ్ బుల్లీశ్వరరెడ్డి, కంచుమాటి నరేష్, వీఏఏ పి.అశోక్, ఎం.ఎ. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కందిలో ఆకుచుట్టు పురుగు ఉధృతి

నరసరావుపేట రూరల్: కందిలో ఆకుచుట్టు పురుగు నివారణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. మండలంలోని కాకాని గ్రామంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మస్తానమ్మ, ఏవో వి.నరేంద్రబాబులు పంట పొలాలను పరిశీలించారు. కందిలో ఆకుచుట్టు పురుగు గమనించి నివారణ చర్యలను రైతులకు తెలియజేశారు. ఆకుచుట్టు పురుగు కంది పెరిగే దశలో ఆశిస్తుందని తెలిపారు. ఆకులను, పూతను చుట్టుగా చుట్టుకొని లోపల ఉండి పంటకు నష్టం కలిగిస్తుందని వివరించారు. దీని నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6మి.లీ లేదా క్వినాల్‌ఫాస్ 2.మి.లీను లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు నాగరాజు, మల్లికార్జునరావు, వెంకటరమ్య, రైతులు పాల్గొన్నారు.

నాదెండ్ల మండలంలో....

నాదెండ్ల: వ్యవసాయ పనులు సాగించేందుకు డొంక రోడ్డుకు మరమ్మతులు నిర్వహించాలని, డొంకకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా ఉందంటూ రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. గణపవరం ,బుక్కాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వ్యవసాయాధికారి హరిప్రసాద్, పశువైద్యాధికారి సాంబశివారెడ్డి, మార్కెటింగ్‌యార్డు జూనియర్ సూపర్‌వైజర్ ప్రసాద్ పాల్గొన్నారు. ముందుగా క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. పత్తిలో గులాబీరంగు పురుగు కనిపిస్తున్నందున లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వలేటి హిమంతరావు, కౌన్సిలర్ తులం సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

• పారిశుధ్యం క్షీణిస్తోంది!





బొల్లాపల్లి మండలంలో కురుస్తున్న వర్షాలకు గండిగనుమల గ్రామంలో పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామంలో ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపైన వర్షపునీరు నిలిచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. పల్లె పండుగ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఈ మురుగు సమస్యను విన్నవించినా ఫలితం లేదు. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని, దోమలు వ్యాప్తి చెందకుండా తగు చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

- బొల్లాపల్లి

జీవాలకు నట్టల నివారణ కార్యక్రమం



జీవాలకు నట్టల నివారణ మందు వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



వేల్పూరులో కార్యక్రమాన్ని ప్రారంభించిన పారా హైమావతి

నరసరావుపేట రూరల్: జీవాలలో నట్టల నివారణ కార్యక్రమాన్ని పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని దొండపాడు గ్రామంలో బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కార్యక్రమంలో పాల్గొని జీవాలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవాలు బరువు పెరగటానికి, ఆరోగ్యంగా ఉండేందుకు, మరణాల సంఖ్య అదుపులో ఉంచేందుకు నట్టల నివారణ మందు దోహదపడుతుందన్నారు. జీవాలకు ఈ మందు ఎంతో ప్రాముఖ్యత ఉందని, దీనిని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కె.కాంతారావు, పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ రామచంద్రరరావు, ములకలూరు పశువైద్యాధికారి డాక్టర్ అర్జునరావు పాల్గొన్నారు.

వేల్పూరులో...

శావల్యాపురం: గొర్రెలు, మేకల్లో వచ్చే నట్టల నివారణ మందును (ద్రావణం) రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ పారా హైమావతి అన్నారు. బుధవారం మండలంలోని వేల్పూరు గ్రామంలోని పశువైద్యశాలలో ప్రభుత్వం మంజూరు చేసిన నట్టల నివారణ మందును రైతులకు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి పాలపర్తి గణేష్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 12 వేల గొర్రెలు, మేకలు మూడు పశువైద్యశాల పరిధిలో ఉన్నాయన్నారు. ఈనెల 31 వరకు నట్టల నివారణ మందు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బీర్పేడి రత్నగిరి, లింగాల శ్రీను, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి

బెల్లంకొండ: సేంద్రియ పద్ధతుల ద్వారా పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆహార పదార్థాలుగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి తెలిపారు. మండలంలోని నందిరాజుపాలెంలో బుధవారం రైతు సాధికార సంస్థ ద్వారా ఆరోగ్యం, పోషకాహారం విభాగం వారితో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, నిత్య అవసర ఆహార పదార్థాలను పంపిణీ 'ఫుడ్ బాస్కెట్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీపీఎం అమలకుమారి మాట్లాడుతూ రైతులు పండించిన ఉత్పత్తులను వారి వద్ద సేకరించి ఉత్పత్తులు అవసరమైన వారికి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బహిరంగ మార్కెట్‌లలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అంటూ ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని తెలిపారు. సంఘాల సభ్యుల ద్వారా వినియోగదారులకు తక్కువ ధరకు ఆహార ఉత్పత్తులను అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు రసాయన రహిత ఆహార పదార్థాలు పూర్తి స్థాయిలో తీసుకోవడం వలన అనారోగ్యం పైన ఖర్చు తగ్గి ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చని వివరించారు.

రాబోవు రోజుల్లో ప్రతి గ్రామంలో అన్ని రకాల ఆహార పదార్థాలు ప్రకతి వ్యవసాయ పద్ధతులలో స్థానికంగా పండించి తినే దిశగా సాగాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అండ్ న్యూట్రీషన్ స్టేట్ రిసోర్స్ పర్సన్ బి.శైలజ, మౌనిక, ఎంటీఎల్ పవన్, హెల్త్ అండ్ న్యూట్రిషన్ కార్యకర్త ధర్మతేజ, ఎంటీలు వీరమ్మ, అనంతలక్ష్మి, అంజలి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



రొంపిచర్ల: మండలంలోని ఆరేపల్లి, అన్నవరం, రామిరెడ్డిపాలెం గ్రామాల్లో బుధవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.32 లక్షల రూపాయల వ్యయంతో మూడు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏపీవో ప్రసాద్ తెలిపారు. అన్నవరం గ్రామంలో రూ.10 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్లకు, ఆరేపల్లిలో రూ.12 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్లు, సైడ్ కాల్వలకు, రామిరెడ్డిపాలెంలో రూ.10 లక్షల రూపాయలతో నిర్మించి తలపెట్టిన సీసీరోడ్లు, డ్రెయిన్‌ల పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎన్ఆర్ఈజీఎస్ మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆయా గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.